


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :127 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | గురువారం 03-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ 'ఛార్జ్‌షీట్'

హైదరాబాద్,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్‌షీట్' విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

క్షీణించిన శాంతిభద్రతలు..

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ నడిబొడ్డున దాడులు, హత్యలు జరుగుతున్నా పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పట్టపగలే కారుతో సామాన్యులను ఢీకొట్టి చంపిన ఘటనల్లోనూ కేసులు నమోదు చేయకుండా పోలీసులు కాపాడుతున్నారని ఆరోపించారు. కంటోన్మెంట్‌లోని మిలిటరీ స్థావరంలోనూ దుండగులు దాడి చేసి తుపాకులు ఎత్తుకెళ్లారని కేటీఆర్ పేర్కొన్నారు. మిలిటరీ స్థావరానికే భద్రత లేకుండా పోవడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. ఇంతకంటే దారుణమైన పరిస్థితి మరొకటి ఉండదని విమర్శించారు.

కొనసాగుతున్న అత్యలు, హత్యాచారాలు...

మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. పోక్సో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరికి అధికార పార్టీ నేతల అండదండలు లభిస్తున్నాయని, నిందితులకు ఆశ్రయం కల్పించారంటూ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సహకరించారని కేటీఆర్ చేసిన ఆరోపణలను కూడా ప్రస్తావించారు.



అభివృద్ధిలోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలం..

అభివృద్ధి విషయంలోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులకు రిబ్బన్ కటింగ్‌లు చేయడం తప్ప కొత్తగా ఏమీ నిర్మించలేదని అన్నారు. ఒక్క చిన్న చెక్‌డ్యామ్ కూడా నిర్మించలేదని ఆరోపించారు.

నాలుగున్నర లక్షల కోట్ల అప్పులు...

రాష్ట్రంలో భారీగా అప్పులు చేసినప్పటికీ అందుకు తగ్గట్టుగా అభివృద్ధి పనులు కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. నాలుగున్నర లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని ఆరోపిస్తూ.. ఇంత అప్పు చేసినా ఒక్క ఇటుక కూడా కొత్తగా పెట్టలేదని, ఒక్క చెక్‌డ్యామ్ కూడా నిర్మించలేదని వ్యాఖ్యానించారు.మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకే 'ఛార్జ్‌షీట్' విడుదల చేసినట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీని కబ్జా చేయాలని చూసే వారిపై పోరాటం

హైదరాబాద్ : కొత్త వాళ్ళు పార్టీలోకి వచ్చి కబ్జా చేయాలనుకుంటున్న ప్రయత్నాల కు వ్యతిరేకంగా పోరాడుతామని, నిజమైన కార్యకర్తలను కాపాడుకుంటామని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి వేడుకలకు హాజరైన రాజగోపాల్ రెడ్డి నివాళులు అర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే ఇతర పార్టీ నాయకులను తీసుకోవడం మంచిదేనని..కానీ మా ఇంట్లోకి వచ్చి మమ్మల్ని వెళ్లగొడతాం అంటే ఊరుకోం అన్నారు. రాబోయేది రాజశేఖర్ రెడ్డి యుగమేనని, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగితే వాళ్ళ తరుపున రాజగోపాల్ రెడ్డి పోరాడుతాడన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటాం అని తెలిపారు. తెలంగాణలో రాజశేఖర్ రెడ్డికి అభిమానులు లక్షలాది మంది ఉన్నారని, వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా మని, ఎవరెన్ని కుట్రలు చేసినా మేం వైఎస్?ర్ శిష్యులం అని, ఆయనను మరువబోమన్నారు. వైఎస్సార్ ఆశయాల కోసం పాటుపడుతా నని తెలిపారు. సభలలో నన్ను సీఎం సీఎం అంటున్నారని, అదే టైం వస్తే బ్రహ్మ దేవుడు కూడా ఆపలేడని వ్యాఖ్యానించారు. నాయకుడు అంటే ఎలా ఉండాలో పేద ప్రజలకు ఏవిధంగా అండగా ఉండాలో స్ఫూర్తి ఇచ్చిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, కార్పొరేట్ హాస్పటల్ లో ఈ రోజు పేదవారు



ట్రీట్మెంట్ తీసుకుంటున్నారంటే అది ఆయన పుణ్యమేనని చెప్పుకొచ్చారు.రైతులకు ఉచిత కరెంటు ప్రవేశపెట్టింది వైఎస్సార్ అని, పేద ప్రజల కోసం, రైతుల కోసం ఆయన తీసుకొచ్చిన పథకాలు దేశ చరిత్రలో ఏ నాయకుడు తీసుకురాలేదు అన్నారు. ఈ ప్రాంత కరువు, ఫ్లోరైడ్ ను తరలించడానికి ఎస్ఎల్బీసీ, ఉదయసముద్రం ప్రాజెక్ట్ తెచ్చిన ఘనత ఆయనదేనని గుర్తు చేసుకున్నారు. 10సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇచ్చాం అన్నారు.

## భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదు: సింగరేణి యాజమాన్యం




హైదరాబాద్, సెప్టెంబర్ 02: సంస్థకు చెందిన భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ అంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. సంస్థకు చెందిన భూగర్భ గనుల ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారాన్ని బుధవారం యాజమాన్యం ఖండించింది. ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని వివరించింది. సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రత కోసం భూగర్భ గనులను కొనసాగిస్తామని పేర్కొంది.గనులు మూసివేయడం, ప్రైవేటు పరం చేయడం తమ లక్ష్యం కాదని సింగరేణి యాజమాన్యం ఈ సందర్భంగా కుండబద్దలు కొట్టింది. ఉత్పత్తి పెంచి, నిర్వహణ వ్యయాలు తగ్గించి గనులను లాభాల్లోకి తీసుకురావడమే ఈ సంస్థ ముఖ్య లక్ష్యమని యాజమాన్యం వెల్లడించింది.

## కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు కేసు పెట్టలేదు: కడియం శ్రీహరి



జనగామ, సెప్టెంబర్ 2: బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. ఈరోజు (బుధవారం) లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు తెలంగాణ మీద పడి లక్షల కోట్లు దోచుకున్నారని.. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిందని ప్రస్తావించారు.

కవిత లేవనెత్తిన అంశాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..

దోచుకున్న సొత్తును లెక్కపెట్టేందుకు వారికి సమయం సరిపోవడం లేదని కవిత చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. ఎక్కడో పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు ఆమె బయటకు వచ్చి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉంటే తమ మీద విమర్శలు, వ్యతిరేకంగా నిరసనలు చేయడం కాదని.. కవిత లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరంలోని ప్రధాన మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు అప్పుడే కుంగిపోయాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కుట్ర జరిగిందనే అనుమానం ఉంటే అప్పుడెందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ సొమ్మును కేసీఆర్ దుర్వినియోగం చేశారు..

కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఉపయోగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అత్యధిక పంట దిగుబడి సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. కేసీఆర్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు కుటుంబం అయ్యిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా కూడా తెలంగాణ ప్రజలు బాగుపడలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

### ఫతేనగర్ రైల్వే స్టేషన్ పరిశీలించిన ఎంపీ ఈటల

కూకట్‌పల్లి పరిధిలోని ఫతేనగర్ రైల్వే స్టేషన్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మెట్లను పరిశీలించిన ఆయన, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొద్దికాలం క్రితం ఇక్కడ ఉన్న రైల్వే స్టేషన్ మెట్లు కూలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ తన చొరవతో హుటాహుటిన నూతన మెట్ల నిర్మాణాన్ని పూర్తి చేయించారు.ఈ నేపథ్యంలో స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాన సమస్యలు మరియు స్థానికుల విజ్ఞప్తులు:

రైల్వే ట్రాక్ దాటేందుకు ఫతేనగర్ బ్రిడ్జిపైకి ఎక్కి దిగడం మహిళలు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోందని, ఇక్కడ వెంటనే ఎలివేటర్ ఏర్పాటు చేయాలని కోరారు.??తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తోందని, మురికి నీరు వస్తుండటంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫతేనగర్‌కు సమీపంలోని లాల్ బహదూర్ శాస్త్రి నగర్‌లో సుమారు 10 వేల

## ప్రజల మదిలో చిరస్మరణీయుడు వైఎస్సార్: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా భావించి.. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసిన జననేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి. ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు నేటికీ ప్రజల దైనందిన జీవితాల్లో భాగమై సజీవంగా నిలిచాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నాటి వైఎస్సార్ పాలన పేదలు, రైతుల సంక్షేమానికి స్వర్ణయుగమని కొనియాడారు. సాగునీటి ప్రాజెక్టులు, హైదరాబాద్ రూపురేఖలు మార్చిన ప్రతిష్టాత్మక ఔటర్ రింగు రోడ్డు వంటి మౌలిక వసతుల కల్పనతో పాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు దన్నుగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుపేదల ప్రాణరక్షక 'ఆరోగ్యశ్రీ', రైతులకు రుణమాఫీ వంటి చరిత్రాత్మక నిర్ణయాలు వైఎస్సార్‌ను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి,



ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ఎం.అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని దివంగత నేతకు ఘనంగా అంజలి ఘటించారు.

## కాంగ్రెస్ అంటేనే దగా, మోసం..హస్తం పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెడతారు



ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసం అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఖమ్మం నగరంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు చేపట్టి, రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అరకొరగా అమలు చేస్తోందని, రైతు రుణమాఫీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపిం చారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థులు కూడా అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారని అన్నారు.ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు అన్ని వర్గాలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను వంచించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిం చకుండా వారిని మోసం చేస్తోందని అన్నారు. పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ తిరిగి రావడం పక్కా. రామరాజ్యం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు భూ కబ్జాలు, భూ దోపిడీలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. గతంలో ఖమ్మం జిల్లాలో ఒక్క మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ చేయలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను నష్టపరుస్తోం దని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లిందని,ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణ, పూర్తి పనులపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జర్నలిస్టుల కోసం మంజూరు చేసిన 23 ఎకరాల

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సీఎం భేటీ..



ఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. రక్షణ ఎక్స్‌పో లో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు.రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.



## సంపాదకీయం

గురువారం 03-09-2026

# గోల్‌కు దూరమవుతున్న హాకీ

ఒకప్పుడు హాకీ పేరు చెబితే భారతదేశమే గుర్తుకొచ్చేది. ఇప్పుడదంతా చరిత్రగా మిగిలిపోయింది. జట్టు ఆటతీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఇటీవలే కాస్త పుంజుకున్నట్లు కనిపించినా నిలకడ కొరవడింది. దూకుడు లోపించింది. తాజాగా హాకీ ప్రపంచకప్‌లో మన జట్టు ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. పతకం సంగతి పక్కన పెడితే, మన పురుషులు, మహిళల జట్లు కనీసం సెమీఫైనల్ కూడా చేరలేక చేతులెత్తేశాయి. ఒకప్పుడు ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లో హాకీలో ఇండియా 8 స్వర్ణ పతకాలు గెలవడం ఒక చరిత్ర. ఆ స్థాయిలో విజయాలు సాధించిన భారత్ గత 41 ఏళ్లలో దక్కించుకున్న పతకాలు రెండు మాత్రమే. అవికూడా 2020, 2024లలో కంచు పతకాలు దక్కాయి. మన జట్టు ప్రస్తుత పరిస్థితికి ఈ పతకాలు గొప్పే అని సరిపెట్టుకోవాల్సిన దుస్థితి! ఇక ప్రపంచకప్‌లో జట్టు పరిస్థితి మరీ తీసికట్టుగా ఉంది. 51 ఏళ్లుగా ఒక్క పతకం కూడా లేదు. బలమైన జట్లను పంపుతున్నామని చెబుతున్నా, మైదానంలోకి వచ్చేసరికి అవి తేలిపోతున్నాయి. తాజా ప్రపంచకప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు కీలక సమయాల్లో తడబడ్డాయి. ప్రతిభ ఉన్నా, ఒత్తిడిని జయించలేక రిక్తహస్తాలతో వెనుదిరిగాయి. అమ్మాయిలు సాధించిన అయిదో స్థానమే మన దేశానికి ఈసారి కప్‌లో మెరుగైన ప్రదర్శన అంటేనే ప్రమాణాలు ఎంతగా పడిపోయాయో అర్థం చేసుకోవచ్చు. ఇక పురుషుల ఆట అంతంత మాత్రమే. ప్రపంచకప్ ముందు వరకు జట్టు కాస్త మెరుగైన ప్రదర్శనే చేసింది. ప్రో హాకీ లీగ్ లాంటి టోర్నీల్లో బలమైన నెదర్లాండ్స్, జర్మనీ లాంటి జట్లను ఓడించింది. ఎంతో పోటీ ఉండే ప్రపంచ కప్‌నకు వచ్చేసరికి తేలిపోయింది. సెమీస్ చేరడం పక్కనపెడితే కనీసం ఏడో స్థానం కూడా దక్కించుకోలేకపోయింది.

సమస్య ఎక్కడ ఉంది?

మిగిలిన క్రీడల మాదిరిగా హాకీని ముందుకు తీసుకెళ్లడంలో సమాఖ్య విఫలమైందనడంలో సందేహం లేదు. ఎందుకంటే క్రికెట్‌ను పిచ్చిగా ఆరాధించే మన దేశంలో హాకీకి ఇప్పటికీ విలువ ఉంది. గొప్పగా చెప్పుకొనే చరిత్ర ఉంది. వర్తమానం మాత్రం ఛిన్నంగా ఉంటోంది. ఆటలో లోపాలు కనిపిస్తున్నాయి. క్రీడాకారుల్లో ఒకప్పటి కసి, పట్టుదల లేవు. చాలా ఏళ్లుగా సీనియర్ జట్టులో ఆడుతున్న ప్లేయర్లే తాజాగా ప్రపంచకప్‌లోనూ పాల్గొన్నారు. మన్‌మీత్ సింగ్ లాంటి యువ ఆటగాళ్లకు చోటు దక్కలేదు. సీనియర్ జట్టుకు ప్రత్యామ్నాయంగా యువ జట్టును సిద్ధం చేయాల్సిన బాధ్యత మేనేజ్‌మెంట్ మీద ఉంది. కానీ కుర్రాళ్లకు ప్రోత్సాహం లేదు. వారిని ఎక్కువ టోర్నీలు ఆడించడంలేదు. చాలినన్ని శిక్షణ శిబిరాలు నిర్వహించడం లేదు. అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి ఎలా ఉంటుందో యువ ఆటగాళ్లకు అనుభవంలోకి రావడం లేదు. దీంతో ప్రపంచ కప్‌నకు సీనియర్లనే ఎంపిక చేయాల్సి వచ్చింది. భారత జట్ల వైఫల్యం వెనక ఇది కూడా ఒక ప్రధాన కారణమే. మరోవైపు భారత్ నుంచి హాకీని అందిపుచ్చుకున్న ఐరోపా జట్లు దూసుకెళ్తున్నాయి. నెదర్లాండ్స్, అర్జెంటీనా, స్పెయిన్, జర్మనీ అదరగొడుతున్నాయి. ముఖ్యంగా నెదర్లాండ్స్ పురుషులు, మహిళల విభాగంలో తిరుగులేని శక్తిగా ఉంది. బలమైన దేహదారుఢ్యం ఉండటం కూడా ఐరోపా ప్లేయర్లకు అదనపు బలంగా ఉంటుంది. వాళ్ల స్థాయిలో లేకపోయినా ఫిట్‌గా ఉంటే మనం గట్టిగానే పోటీ ఇవ్వగలం. కానీ, సీనియర్ స్థాయిలో ఆడుతున్న ప్లేయర్లు అలా కనిపించడం లేదు. నైపుణ్యానికి కొరత లేకపోయినా, ఫిట్‌నెస్‌తో పాటు మానసిక బలం లోపించడం భారత్‌ను హాకీలో వెనక్కినెడుతోంది.

బడ్జెట్‌లో పెద్దపీట వేయాలి

ఒకప్పుడు భారత ఆటగాళ్లు గడ్డి మైదానాల్లోనే ఆడేవాళ్లు. ధ్యాన్‌చంద్ లాంటి దిగ్గజాలు స్టిక్‌తో ప్రత్యర్థిని మాయ చేసి గోల్ మీద గోల్ కొట్టేవాళ్లు. 1970 తర్వాత గడ్డి మైదానాల స్థానంలో ఆస్ట్రోటర్ఫ్‌లు రావడంతో భారత్ నెమ్మదిగా హాకీలో వెనకంజలో పడిపోయింది. ఆస్ట్రోటర్ఫ్ మైదానాల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావడమే ఇందుకు కారణం. హాకీ సంఘంలో రాజకీయాలు కూడా దేశీయంగా ఆటను కుదేలు చేశాయి. అయినప్పటికీ గత పదేళ్లలో కొంతమేర పుంజుకుంది. విదేశీ కోచ్‌లు రావడం, శిక్షణ కేంద్రాలు పెరగడంతో గత ఏడెనిమిదేళ్లుగా మళ్లీ ఊపొచ్చింది. కానీ, ఆ ఉత్సాహం అంతే వేగంగా చల్లారుతోంది. క్రమంగా మున్ముందుకు, పైపైకి వెళ్లాల్సింది పోయి, వేగంగా తిరోగమనం దిశగా సాగుతోంది. హాకీలో మళ్లీ ఇండియా స్వర్ణయుగాన్ని చూడాలంటే– దిగువ స్థాయిలో ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలి. బడ్జెట్‌లో ఈ క్రీడకు పెద్దపీట వేయాలి. దేశవాళీ టోర్నీలను పెంచి, యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాలి. విదేశీ కోచ్‌లపైనే ఆధారపడకుండా భారత దిగ్గజాలను కూడా ఆటలో భాగం చేయాలి. అప్పుడే ఒలింపిక్స్ స్థాయిలో భారత్ నుంచి ఒకప్పటి ఆటను ఆశించవచ్చు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ పక్కదారి.. సిఫార్సుల సంకెళ్లలో తెలంగాణ పోలీసింగ్




హైదరాబాద్: బాస్ గట్టోడే.. కానీ చేతులు కట్టేస్తే ఏం చేయగలడు? రాష్ట్ర పోలీసింగ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై పలువురు రిటైర్డ్ పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. నేరాల నియంత్రణలో పోలీసు శాఖ పూర్తిగా విఫలమైందని చెప్పడం సరికాదని, క్షేత్రస్థాయిలో అధికారులకు స్వేచ్ఛ తగ్గడం, రాజకీయ జోక్యం మితిమీరడం, ప్రతి చిన్న వ్యవహారంలో సిఫార్సులు, ఫోన్లు పెరగడం పోలీసింగ్ సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయని వారు విశ్లేషిస్తున్నారు. మరోవైపు కొందరు అధికారులు సైతం చట్టం అమలు కంటే రాజకీయ నేతల మెప్పు పొందడానికే ప్రాధాన్యమిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రెండు పరిణామాల మధ్య అసలు పోలీసింగ్ నలిగిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఫ్రెండ్లీకి హద్దెక్కడ?

తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజలకు పోలీసులను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట వేశారు. బాధితులు భయం లేకుండా ఠాణాకు రావడం, ఫిర్యాదు చేయడం, పోలీసులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం దీని అసలు లక్ష్యం. కాలక్రమంలో ఈ విధానం అమలులో అసలు ఉద్దేశం పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాల్సిన వ్యవస్థ నేరగాళ్ల విషయంలోనూ మెతకగా మారితే, చట్టంపై భయం తగ్గుతుందని రిటైర్డ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరస్తుడితో స్నేహం కాదని, బాధితుడికి భరోసా.. నేరగాడికి చట్టం అంటే భయం.. రెండూ సమాంతరంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.

వరుస ఘటనలతో సవాల్

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న హత్యలు, అత్యాచారాలు, గ్యాంగ్ గొడవలు శాంతిభద్రతలపై చర్చకు దారితీస్తున్నాయి. తుక్కుగూడలో 21 ఏళ్ల గిరిజన యువతిపై అత్యాచారం, హత్య ఘటన తీవ్ర కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ అక్కడి క్వార్టర్స్‌లో నివసిస్తోంది. ఆమెపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

అంతేకాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో తన వద్ద పనిచేస్తున్న గుమస్తా సమస్య పరిష్కారానికి ప్రయత్నించిన యువకుడిని మణుగూరు ఖాన్‌దాన్ (ఎంకే గ్యాంగ్)గా పిలవబడుతున్న ముఠా పిడిగుద్దులతో హతమార్చడం కలకలం రేపింది. హైదరాబాద్‌లోని వట్టేపల్లిలో 60 ఏళ్ల వ్యక్తిని ఇంటికి సమీపంలోనే కత్తులతో పొడిచి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా మక్తల్‌లో 53 ఏళ్ల మహిళపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడి తీవ్రంగా గాయపరిచిన ఘటన వెలుగులోకి వచ్చింది. సూర్యాపేటలో పాత వివాదం నేపథ్యంలో ఒక వ్యక్తిని హత్యచేసి, ఆ నేరాన్ని కప్పిపుచ్చేందుకు సొంత తండ్రిని సైతం హత్య చేసినట్లు పోలీసులు గుర్తించిన ఘటన ఉలిక్కిపడేలా చేసింది. ఇలాంటి వరుస ఘటనలను కేవలం పోలీసుల వైఫల్యంగా చూడటం కంటే, నేర నియంత్రణ వ్యవస్థలో ఏర్పడుతున్న లోపాలుగా గుర్తించి, సరిదిద్దాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సిఫార్సుల సంకెళ్లలో పోలీసింగ్

క్షేత్రస్థాయి పోలీసింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్న అంశాల్లో రాజకీయ జోక్యం ప్రధానంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన దగ్గరి నుంచి నిందితుడిని అరెస్టు చేయడం, విచారణ, స్టేషన్ బెయిల్ వరకు స్థానిక నేతల ఫోన్లు, సిఫార్సులు వస్తున్నాయన్నది అక్షరాల నిజం. ప్రతి వ్యవహారంలో రాజకీయ జోక్యం ఉంటుందని చెప్పలేకపోయినా, తీవ్రమైన కేసుల్లోనూ 'మనవాడు' అనే ఒత్తిడి వస్తే ఎస్సై స్వతంత్రంగా ఎలా పని చేయగలడన్న ప్రశ్నను రిటైర్డ్ అధికారులు లేవనెత్తుతున్నారు.

నేతల మెప్పు కోసం..

సిఫార్సు లేఖలతో పోస్టింగులు తెచ్చుకుంటున్న పోలీసులు, ఆ తర్వాత ఆ పోస్టింగ్‌ను కాపాడుకునేందుకే ప్రాధాన్యతనిస్తున్నారు. రాజకీయ నేతల జోక్యంతో పాటు కొందరు పోలీసు అధికారుల వైఖరి కూడా ఈ సమస్యను మరింత జటిలం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టింగ్, బదిలీ, మంచి స్థానం కోసం రాజకీయ ఆశీస్సులు అవసరమనే భావన కొందరిలో పెరగడంతో నేతల పట్ల అమిత విధేయత చూపుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో చట్టం చెప్పేదానికంటే స్థానిక నేత ఏం చెబుతున్నారన్నదే ముఖ్యమనుకునే పరిస్థితులు కొన్నిచోట్ల ఏర్పడుతున్నాయి. రాజకీయ నేతలు పోలీసింగ్‌లో జోక్యం చేసుకోవడం ఎంత ప్రమాదకరమో, అధికారులు రాజకీయ అండ కోసం ప్రయత్నించడం కూడా అంతే ప్రమాదకరమని వరుస ఘటనలు హెచ్చరిస్తున్నాయి.

ఠాణాల చుట్టూ బ్రోకర్లు

పోలీస్ స్టేషన్ల చుట్టూ బ్రోకర్ల వ్యవస్థ పెరుగుతోందన్న ఆరోపణలు శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. కేసు నమోదు నుంచి బెయిల్ వరకు 'నేను చూసుకుంటా' అంటూ మధ్యవర్తులు రంగంలోకి దిగడం, కొందరు స్థానిక నేతల పేర్లు చెప్పుకొని ఠాణాల్లో తిరగడం వంటి పరిస్థితులకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం కనిపిస్తోంది. వేలకోట్లు కొల్లగొట్టిన షేర్స్ బజార్, కిసాన్ పరివార్ వంటి కేసుల్లో నిందితులకు పోలీసుల నుంచి సహకారం అందిందన్న ఆరోపణలు రావడం వ్యవస్థలో అంతర్గత నిఘా అవసరాన్ని గుర్తుచేస్తోంది.

బెయిల్ కూడా ఆదాయ మార్గమా?

స్టేషన్ బెయిల్, అరెస్టు చేయకుండా ఉండటం, కేసులో సెక్షన్లు మార్చడం, చార్జిషీట్, నోటీసులు, పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యే నిబంధనల్లో వెసులుబాటు వంటి అంశాల్లో డబ్బుల డిమాండ్ ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఏడేళ్లలోపు శిక్షలు పడే తీవ్ర నేరాల్లోనూ స్టేషన్ బెయిల్ మంజూరు చేసేందుకు తీసుకొచ్చిన బీఎన్ఎస్ శిక్షాస్మృతిని కొందరు ఎస్సైలు దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్ బెయిల్ కోసం లక్షల్లో చేతులు మారుతున్నట్లు పలు ఘటనలు రుజువు చేస్తున్నాయి. దీంతో కాసులుంటే ఏదైనా చేయొచ్చన్న అభిప్రాయం కూడా నేరాలు పెరిగేందుకు కారణమవుతోంది. చందానగర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు దర్యాప్తు, చార్జిషీట్‌కు సంబంధించి రూ. 75 వేల లంచం ఆరోపణపై ఎస్సై, కానిస్టేబుల్ ఏసీబీకి చిక్కారు. వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఓ కేసుకు సంబంధించిన నోటీసుల విషయంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సైపై ఏసీబీ కేసు నమోదైంది. మరోవైపు పోలీసు విషయంలో రూ. 60 వేల లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై కంప్యూటర్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న డీఎస్పీపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. మార్కెట్ విలువ ప్రకారం భారీగా ఉన్న ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు అప్పట్లో వెల్లడైంది.

బాస్ గట్టోడే..

ప్రస్తుత డీజీపీ సీ.వీ. ఆనంద్ కఠినంగా వ్యవహరించగల అధికారిగా పోలీసు వర్గాల్లో పేరుంది. గతంలో ఆయన పనితీరును దగ్గర నుంచి చూసిన పలువురు రిటైర్డ్ అధికారులు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. శాంతిభద్రతలపై పట్టుతో పాటు క్షేత్రస్థాయి వ్యవస్థను నడిపించగల సామర్థ్యం ఆయనకు ఉందని అభిప్రాయపడుతున్నారు. అయితే డీజీపీ ఎంత సమర్థుడైనా కిందిస్థాయి వరకు ఆయన నిర్ణయాలు అమలుకావాలంటే పోస్టింగులు, బదిలీలు, కేసుల దర్యాప్తులో రాజకీయ ఒత్తిళ్లు కొనసాగకూడదని వారు పేర్కొంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లు కొనసాగితే ఆశించిన ఫలితాలు రావడం కష్టమని చెబుతున్నారు.

సీఎం నుంచి ఒక్క గట్టి సందేశం వస్తే..

ముఖ్యమంత్రి హోం శాఖను కూడా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలపై నేరుగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని కమిషనర్లు, ఎస్పీలతోనే కాకుండా అవసరమైతే ఎస్హెచ్‌ఓ అధికారులతోనూ నేరుగా మాట్లాడి, చట్టం అమలులో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు.. అదే సమయంలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదు అనే స్పష్టమైన సందేశం ఇవ్వాలని రిటైర్డ్ అధికారులు కోరుతున్నారు. ఏపీ 9లోనూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అదే విధంగా అందరితో గ్రూప్ కాల్ మాట్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేస్తున్నారు. రాజకీయ నేతల సిఫార్సులకు హద్దు పెట్టడం, పోస్టింగులు, బదిలీల్లో వృత్తిపరమైన పనితీరుకు ప్రాధాన్యమివ్వడం, డీజీపీ నుంచి ఎస్సై వరకు అధికారులకు చట్టప్రకారం పనిచేసే స్వేచ్ఛ కల్పించడం అవసరమని వారు పేర్కొంటున్నారు. పోలీసులకు స్వేచ్ఛతో పాటు జవాబుదారీతనం, రాజకీయ వ్యవస్థ నుంచి అనవసర జోక్యానికి అడ్డుకట్ట, అవినీతి అధికారులపై కఠిన చర్యలు.. ఈ మూడు జరిగితేనే రాజకీయం నుంచి పోలీసింగ్‌కు మళ్లీ పదును వస్తుందని మాజీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# 40 కోట్ల టెండర్ కు రెండున్నర కోట్ల అమ్యామ్యాలు...

హైదరాబాద్,వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదు. ఈ సామెతను గడిచిన కొన్ని సంవత్సరాలుగా మహిళ ఐఏఎస్ అధికారి నిజం చేసి చూపిస్తున్నారు. చూపించడమే కాదు దర్జాగా కోట్లను తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఇదంతా కూడా వాట్సప్ కాల్ ద్వారా ఆమె చేసి చూపిస్తున్నారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ శాఖలో ఆ మహిళా అధికారి కీలకంగా ఉండేవారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుపొందిన జిల్లాకు కలెక్టర్ గా వ్యవహరించారు. ఆ తర్వాత ఆమె ఒక శాఖలో కీలక అధికారిగా పనిచేస్తున్నారు. ఈ శాఖలో రకరకాల అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటాయి. గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక సంస్థకు ఆమె కాంట్రాక్టు కట్టబెట్టారు. ఏకంగా 40 కోట్ల టెండర్ ఆ సంస్థకు అందే విధంగా చూశారు. అప్పటినుంచి ఆ సంస్థ ఆధిపతులకు.. ఆ మహిళ ఐఏఎస్ అధికారికి ఫెవికాల్ సంబంధం ఏర్పడింది. ఆ అధికారికి.. కంపెనీకి మధ్య వ్యవహారాలు చక్కబెట్టడానికి ఒక ఏడి స్థాయి అధికారి పనిచేసేవారు. గులాబి పార్టీ.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ.. అధికారంలో ఎవరు ఉన్నా సరే ఆ శాఖకు సంబంధించిన కాంట్రాక్ట్ మొత్తం ఆ కంపెనీకి దక్కుతుంది. పైగా ఎటువంటి నిబంధనలు పాటించే అవకాశం లేకుండానే ఆ మహిళా అధికారి ఆ సంస్థకు టెండర్ దక్కే విధంగా చూస్తుంటారు. ప్రభుత్వ మారినప్పటికీ.. అధికారులు మారినప్పటికీ ఆ మహిళ ఐఏఎస్ అధికారి మాత్రం ఆ శాఖలోనే ఉంటారు. పైగా ఆ కంపెనీకి మాత్రమే కాంట్రాక్ట్ దక్కే విధంగా చూస్తుంటారు. ఇలా కాంట్రాక్ట్ దక్కేలా చూసినందుకు ఆ కంపెనీ ఆ మహిళా అధికారికి ఏకంగా 2.5 కోట్లు చెల్లించినట్టు తెలుస్తోంది. రెండు విడతలుగా అది కూడా నగదు రూపంలో ఆ మహిళ అధికారికి ఆ కంపెనీ నిర్వాహకులు ఇచ్చినట్టు సమాచారం. అయితే ఇదంతా కూడా కేవలం వాట్సాప్ కాల్ ద్వారా జరిగిపోవడం మరింత విశేషం. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ. ఆ మహిళా అధికారి ఆ శాఖలో ఉంటుంటారు. ఆమెను బదిలీ చేసే సాహసం ఏ ప్రభుత్వం కూడా చేయదు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిని రూపుమాపడానికి ప్రయత్నాలు చేస్తోంది. అవినీతి అధికారులను అరెస్ట్ చేయిస్తుంది. వారి ఆస్తులను బయటపెడుతున్నది. అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నది. అయినప్పటికీ ఇటువంటి మహిళా అధికారులు ఏమాత్రం భయం లేకుండా సంపాదిస్తున్నారు అంటే వారి వెనుక బలమైన అండ ఉందని అర్థం. మరి ఇటువంటి అండలను ఏ విధంగా తొలగిస్తారు.. అవినీతి అధికారులను ఏ విధంగా శిక్షిస్తారు అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలని విశ్లేషకులు అంటున్నారు.

# బడ్జెట్ సహాయం అందించాలి

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో కొత్త జవహర్ నవోదయ విద్యాలయాల (జేఎన్వీ) ఏర్పాటుతోపాటు రాష్ట్రంలో మరో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన బడ్జెట్ సహాయం అందించాలని రాజ్యసభ సభ్యులు శ్రీ గమనేని రమేశ్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 28 జిల్లాలు ఉండగా, 15 జిల్లాల్లో మాత్రమే జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరై, ప్రస్తుతం పని చేస్తున్నాయని ఎంపీ తెలిపారు. దీంతో 13 జిల్లాలు నవోదయ విద్యాలయాలు లేకుండా ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన రెసిడెన్షియల్ విద్యను అందించడంలో నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నవోదయ విద్యాలయాలను విస్తరించడం ద్వారా నాణ్యమైన విద్యకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని ఎంపీ పేర్కొన్నారు. అనుభవాత్మక విద్య, డిజిటల్ విద్య, మోడల్ పాఠశాలల అభివృద్ధి వంటి అంశాలకు కూడా ఈ విస్తరణ తోడ్పడుతుందని తెలిపారు. 2024 డిసెంబర్‌లో కేంద్ర మంత్రివర్గం ఐదేళ్ల కాలానికి ?2,359.82 కోట్ల అంచనా వ్యయంతో దేశవ్యాప్తంగా 28 కొత్త జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని శ్రీ లింగమనేని రమేశ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన 13 జిల్లాల్లో జేఎన్వీల ఏర్పాటుకు ఐదేళ్ల కాలంలో సుమారు ?1,096 కోట్ల మేర నిధుల అవసరం ఉంటుందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో నవోదయ విద్యాలయాలు లేని మొత్తం 13 జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయ ఆమోదంతోపాటు తగిన బహువార్షిక బడ్జెట్ కేటాయింపులు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌ను ఎంపీ కోరారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా ఎంపీ తన వినతిపత్రంలో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లో పునర్వ్యవస్థీకరించిన రాష్ట్రంలో జాతీయ స్థాయి విద్యా, వైద్య సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారని, దాని ఫలితంగా ఎయిమ్స్ మంగళగిరి ఏర్పాటైందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలు, విస్తారమైన భౌగోళిక విస్తీర్ణం, గిరిజన ప్రాంతాలు, ఉత్తరాంధ్ర , రాయలసీమ ప్రాంతాల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో మరో రెండు ఎయిమ్స్ లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని శ్రీ లింగమనేని రమేశ్ తెలిపారు. తద్వారా అత్యున్నత వైద్య సేవలు మరింత అందుబాటులోకి రావడంతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం, వైద్య విద్య, పరిశోధన రంగాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ తెలిపారు. అధునాతన వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య సమతుల్య అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి ముందుగా సాధ్యాసాధ్యాల అధ్యయనం, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ కోసం ప్రారంభ బడ్జెట్ కేటాయింపులు చేయాలని, అనంతరం సంస్థ ఏర్పాటుకు అవసరమైన మూలధన నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు.

# ఒకే ఒక్కడు స్టైల్ లో విజయ్

చెన్నై,తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విజయ్ అనుసరిస్తున్న తీరు సాంప్రదాయ రాజకీయాలకు పూర్తి భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి పీఠాన్ని అధికారాన్ని చెలాయించే వేదికగా కాకుండా, ప్రజలు ఇచ్చిన బాధ్యతగా భావిస్తూ ఆయన అడుగులు వేస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో సెంట్రల్ జైలులో తనిఖీలు చేయడం, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యార్థుల హాస్టళ్లకు అకస్మాత్తుగా వెళ్లి నిరాడంబరంగా సామాన్యులలో ఒకడిగా కలిసిపోవడం వంటి చర్యలు నాటి ఒకే ఒక్కడు సినిమా ఘట్టాలను తలపిస్తున్నాయి. ఈ వైఖరి వెనుక అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. తాను ఒక వీఐపీనో లేదా పాలకుడినో అని అనుకోకుండా, ప్రజల మధ్య ఉండే సిటిజన్ విజయ్ అనే ముద్రను బలంగా తీసుకెళ్లడం. అధికారుల ఆర్భాటాలు లేకుండా, స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయడం ద్వారా వికేంద్రీకృత వ్యవస్థల్లో లోపాలను నేరుగా ఎత్తిచూపుతున్నారు. చెన్నై కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై

# రోల్ మోడల్ నియోజకవర్గం మంగళగిరి



గుంటూరు, విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయి. ప్రభుత్వ నిధులతో పాటు భారీగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు, పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్షిప్ విధానాలను అనుసంధానిస్తూ వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. చేనేత కార్మికుల కోసం ప్రత్యేక బిజినెస్ సెంటర్లు, స్వర్ణకారుల కోసం ప్రత్యేక హబ్, అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, మోడల్ రైతుబజార్లు, విశాలమైన రహదారుల నిర్మాణం వంటి ప్రాజెక్టులతో మంగళగిరిని ఒక రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ప్రజాప్రతినిధిగా తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమే అయినప్పటికీ, ఇదే తరహా ప్రాధాన్యత, నిధుల ప్రవాహం రాష్ట్రంలోని మిగిలిన 174 నియోజకవర్గాలకు ఎందుకు లభించడం లేదనే ప్రశ్న రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది. భారతీయ రాజకీయాల్లో ముఖ్యమంత్రులు, శక్తివంతమైన మంత్రులు, కీలక నేతలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు తరలడం కొత్తేమీ కాదు. గతంలో కుప్పం, పులివెందుల, గజ్వేల్ వంటి నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి దీనికి నిదర్శనం. అయితే, ప్రభుత్వ అధికారిక బడ్జెట్ పరిమితంగా ఉన్నప్పుడు, ఒకే నియోజకవర్గానికి ప్రాధాన్యత పెరిగితే సహజంగానే ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి మందగిస్తుందనే ఆందోళన స్థానిక శాసనసభ్యుల్లోనూ, ప్రజల్లోనూ వ్యక్తమవుతుంది. సమాన వికేంద్రీకరణ జరగకపోవడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగే ప్రమాదం ఉందిమంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధికి కేవలం ప్రభుత్వ బడ్జెట్ ఒక్కటే కారణం కాదు. నారా లోకేష్ తనకున్న ఐటి మంత్రి హోదా, కార్పొరేట్ సంస్థలతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించి భారీగా సిఎస్ఆర్ నిధులను, పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నారు. పీఫోర్ మోడల్ ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారు. అయితే, రాష్ట్రంలోని సాధారణ ఎమ్మెల్యేలకు లేదా మంత్రులకు ఇటువంటి కార్పొరేట్ నెట్‌వర్కింగ్ లేదా పెట్టుబడులను ఆకర్షించే అవకాశం లేకపోవడం వల్ల వారు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇది నియోజకవర్గాల మధ్య అభివృద్ధి వ్యత్యాసానికి ప్రధాన కారణమవుతోంది. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి లోకేష్ ఓటమి పాలైనప్పటికీ, ఆ తర్వాత నియోజకవర్గంలోనే ఉంటూ సొంత నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి 2024లో భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన రాజకీయ భవిష్యత్తుకు, నాయకత్వ పటిమకు మంగళగిరిని ఒక షోకేస్ గా మార్చాలనేది ఆయన వ్యూహం. ఈ మోడల్ ద్వారా తాను కేవలం ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా అభివృద్ధి ప్రదాతనని నిరూపించుకోవాలని భావిస్తున్నారు. అయితే, ఇది అధికార పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలపై ప్రజా ఒత్తిడిని పెంచుతోంది. మా ఎమ్మెల్యే కూడా లోకేష్ లాగా నిధులు ఎందుకు తేలేకపోతున్నారు అనే ప్రశ్న సాధారణ ప్రజల నుంచి వస్తోంది. మంగళగిరిలో అమలు చేస్తున్న సిఎస్ఆర్, పీఫోర్ , ఇన్నోవేటివ్ ఉపాధి నమూనాలు . అయితే, ఈ మోడల్ కేవలం ఒక్క నియోజకవర్గానికే పరిమితం కాకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక విధివిధానాన్ని రూపొందించి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలలో ప్రాధాన్యత ఆధారంగా ఊఖీ నిధులను సమంగా పంపిణీ చేసే వ్యవస్థను తీసుకురావాలి. ప్రతి జిల్లాకు లేదా నియోజకవర్గానికి పెట్టుబడులను ఆకర్షించేలా స్థానిక ఎమ్మెల్యేలకు సాంకేతిక, పాలనాపరమైన మద్దతును ప్రభుత్వం అందించినప్పుడే మంగళగిరి అభివృద్ధి మోడల్ సక్సెస్ అయినట్లు అనుకోవచ్చు.

# ప్రైవేట్ రంగంలోకి డిఫెన్స్...



న్యూఢిల్లీ,మనదేశంలో ప్రైవేట్ వ్యవస్థ అన్ని రంగాలకు విస్తరించింది. ఇంతవరకు ప్రైవేట్ రంగం తొంగి చూడని కొన్ని రంగాలు ఉన్నాయి. అందులో డిఫెన్స్ రంగం ముందువరుసలో ఉంటుంది. అయితే ఇప్పుడు ఇందులో కూడా ప్రైవేట్ ప్లేయర్స్ వచ్చేసారు.ఇండియన్ డిఫెన్స్ టెక్నాలజీని పూర్తిగా మార్చేయడానికి భారత ప్రభుత్వం ప్రవేట్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది. దీని మీద కొంతమంది విమర్శలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆత్మ నిర్భర్ భారత్ అంటూ సరికొత్త పథకాన్ని తీసుకొచ్చి.. దేశాన్ని విదేశీ దిగుమతుల మీద ఆధారపడడాన్ని తగ్గించారు. ప్రైవేట్ కంపెనీలకు డిఫెన్స్ రంగంలో అవకాశం కల్పించడం అనేక కారణాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. డ్రోన్ టెక్నాలజీ వ్యవస్థ ఉంది. వాటిని ఇండియన్ డిఫెన్స్ రంగంలో వాడబోతున్నారు.. ప్రభుత్వ రంగ సంస్థలతో పోల్చి చూస్తే ప్రైవేట్ కంపెనీలు అత్యంత వేగంగా ఉత్పత్తులను తయారుచేస్తూ ఉంటాయి. అందువల్లే ఆ కంపెనీలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచింది. ఇక దేశీయంగా చూసుకుంటే రక్షణ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశంలో డిఫెన్స్ పరికరాలు తయారు చేయడం వల్ల రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గుతాయి. విదేశీ కరెన్సీ భారం తగ్గుముఖం పడుతుంది. ప్రైవేట్ కంపెనీల వల్ల భారతదేశం గ్లోబల్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా మారుతుంది. ఇతర దేశాలకు ఆయుధాలను ఎగుమతి చేసే ఆస్కారం లభిస్తుంది.. ఇక తాజా ఒప్పందల ద్వారా టాటా, రిలయన్స్, ఎల్ అండ్ టి, కళ్యాణి వంటి భారత ప్రైవేట్ కంపెనీలకు ఆర్డర్లు లభించబోతున్నాయి.రిలయన్స్.. టాటా.. ఎల్ అండ్ టి.. కళ్యాణి గ్రూప్ సంస్థలు ఇప్పటికే మిస్సైల్స్.. యుద్ధ విమానాలు.. సబ్ మెరైన్లు తయారు చేస్తున్నాయి.. భారతదేశం రక్షణ సాంకేతికతను ప్రైవేట్ కంపెనీలతో పంచుకోవడం వెనుక ప్రధాన కారణం కూడా ఒకటుంది. సైనిక దళాల ఆధునికీకరణ వేగవంతం చేయడం.. దేశీయ రక్షణ ఉత్పత్తిని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడం.. ప్రభుత్వ పరిశోధన సంస్థ అయిన డిఆర్డిఓ డెవలప్ చేసిన టెక్నాలజీని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తూ ఉంటుంది. దీనివల్ల వేగవంతమైన భారీ ఉత్పత్తి చోటు చేసుకుంటుంది. ప్రైవేట్ కంపెనీల వద్ద ఉన్న అత్యాధునిక ప్లాంట్లు.. మౌలిక సదుపాయాల ద్వారా ఆయుధాలను వేగంగా తయారు చేయవచ్చు. భారీగా ఉత్పత్తి చేయవచ్చు.. ప్రయోగశాలకే పరిమితమైన సాంకేతికతను ప్రైవేట్ రంగానికి ఇస్తే అవి త్వరగా ఇద్దరంగానికి అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థల మీద భారం తగ్గుతుంది.. హెచ్ ఏ ఎల్, బి ఈ ఎల్ వంటి ప్రభుత్వ రక్షణ సంస్థలపై ఉన్న అదనపు పని భారం తగ్గుతుంది. ప్రైవేట్ కంపెనీలను భాగస్వాములను చేస్తే ఉత్పత్తి మరింత పెరుగుతుంది. ప్రైవేట్ రంగంలో పోటీ ఉండడంవల్ల రక్షణ పరికరాల తయారీ ఖర్చు పూర్తిగా తగ్గుతుంది. రాడార్లు.. కమ్యూనికేషన్ సిస్టం వంటి వాటి తయారీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది.. అంతర్జాతీయ రక్షణ మార్కెట్లో భారతీయ ప్రైవేట్ కంపెనీలో భాగస్వాములు కావడానికి సాంకేతికత తోడ్పడుతూ ఉంటుంది. ఇప్పటికే డిఫెన్స్ పరికరాల తయారీ విషయంలో అమెరికా దూకుడుగా ముందుకు వెళ్తోంది. చైనా కూడా ఆదే స్థాయిలో ఉంది. ఇజ్రాయిల్.. ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. వీటన్నిటికి చెక్ పెట్టి అగ్రస్థానంలో ఉండాలి అంటే భారత్ కచ్చితంగా ఈ మార్పులకు శ్రీకారం చుట్టాల్సిందే.

# మూడేళ్లైనా పదవులు ఊసేది



హైదరాబాద్ ,తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా, ప్రభుత్వంలో భాగస్వామ్యం కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ద్వితీయ శ్రేణి నేతలు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఆశించిన ఫలితం దక్కడం లేదు. కార్పొరేషన్ ఛైర్మన్లు, మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థలు, దేవాలయ ట్రస్ట్ బోర్డులు, డీసీసీబీలు, పీఏసీఎస్ వంటి వందలాది నామినేటెడ్ పోస్టులు నేటికీ అరకొరగానే భర్తీ కావడం లేదా పెండింగ్‌లోనే పడి ఉండటం గులాబీ శ్రేణులను ఓడించి హస్తం జెండాను ఎగురవేసిన కేడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. అంతర్గత విభేదాలకు తోడు సొంత కేడర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల కాంగ్రెస్‌లో నిరసన జ్వాలలు క్రమంగా రగులుతున్నాయి.గాంధీభవన్‌లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో తరచుగా సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి నిర్ణయాల అమలులో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ 70% కంటే ఎక్కువ నామినేటెడ్ పోస్టులను పార్టీ కోసం కష్టపడిన పాత కార్యకర్తలకే కేటాయిస్తామని స్పష్టం చేస్తున్నప్పటికీ, ఎమ్మెల్యేలు మరియు నియోజకవర్గ ఇన్‌ఛార్జుల నుంచి సిఫార్సుల జాబితాలు సకాలంలో రాకపోవడమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని పార్టీ వర్గాల మాట. ప్రభుత్వం సాధించిన సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన కేడర్.. పదవుల విషయంలో అలసత్వంతో తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. నియోజకవర్గాల్లో ముఠా రాజకీయాలు ఉన్నాయి. ఉన్నది ఒక్క పోస్టు, ఆశావహులు పదుల సంఖ్యలో ఉంటున్నారు. ఏ ఒక్కరి పేరు సిఫారసు చేసినా మిగిలిన వర్గాలు తమకు వ్యతిరేకంగా మారతాయనే భయంతో చాలామంది ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు జాబితాలను పంపకుండా వాయిదా వేస్తున్నారు. గడిచిన మూడేళ్లలో బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన చేరికల నేతలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, విపక్షంలో ఉన్నప్పుడు కేసులు ఎదుర్కొని పోరాడిన పాత కాంగ్రెస్ కేడర్ తీవ్ర అన్యాయానికి గురవుతోందనే భావన బలంగా నాటుకుపోతోంది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు, స్థానిక సీనియర్ నేతలు, డీసీసీ అధ్యక్షుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఉమ్మడి జిల్లాల వారీగా ఇచ్చే పేర్లలో కూడా అధిష్ఠానం వద్ద తీవ్ర పోటీ నెలకొంటోంది.విపక్షాల్లో ఉన్నప్పుడు వీధిపోరాటాలు చేసి పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలకు అధికారం దక్కిన మూడేళ్లకి కూడా గుర్తింపు లభించకపోవడం వల్ల గ్రామ, మండల స్థాయిలో కేడర్ పూర్తిగా సైలెంట్ అయిపోతోంది. పార్టీ సభ్యత్వ నమోదు, ప్రభుత్వ పథకాల ప్రచారం లేదా రాజకీయ ప్రత్యర్థులపై ఎదురుదాడి చేయడంలో గతంలో ఉన్న ఉత్సాహం ఇప్పుడు కార్యకర్తల్లో కనిపించడం లేదు. ప్రభుత్వం సాధించిన విజయాల కంటే అంతర్గత పంచాయితీలే ఎక్కువగా వార్తల్లో నిలవడం పార్టీ ఇమేజ్‌ను కూడా మసకబారుస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం , టీపీసీసీ నాయకత్వం ఇకనైనా రాజకీయ భయాలను పక్కనబెట్టి నామినేటెడ్ పోస్టుల భర్తీని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉందని క్యాడర్ అంటున్నారు. ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలొగ్గకుండా, కష్టపడ్డ నిజమైన కార్యకర్తలకు పదవులు కట్టబెడితే తప్ప కాంగ్రెస్ శ్రేణుల్లో పూర్వ వైభవం , రాజకీయ ఉత్సాహం తిరిగొచ్చే అవకాశం కనిపించడం లేదని చెబుతున్నారు.

# కొత్త ఫీచర్లతో ఉగ్రవాదులు...



శ్రీనగర్, వాట్సప్ ఉపయోగిస్తే దొరికిపోతున్నారు. ఫేస్బుక్ వాడితే తప్పించుకోలేకపోతున్నారు. ఇన్స్టాగ్రామ్ ఉపయోగిస్తే సరెండర్ అవుతున్నారు. కొద్దిరోజులుగా సరిహద్దుల్లో భారత భద్రత దళాలు ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో ఉగ్రవాదులకు ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది.ఇలాగైతే తమ కార్యకలాపాలు ఆగిపోతాయని.. సరిహద్దుల్లో రక్తపాతం నిలిచిపోతుందని.. తమ ఉనికికే ప్రశ్నార్థకం ఏర్పడుతుందని ఉగ్రవాదులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఉగ్రవాదులకు అండగా నిలవడానికి పాకిస్తాన్ సరికొత్త ఎత్తులకు పాల్పడుతోంది. భారత భద్రత దళాలు కూడా ఊహించని విధంగా సరికొత్త పన్నాగానికి తెర లేపింది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం భారత సంస్థల నిఘా నుంచి తప్పించుకోవడానికి ఉగ్రవాదులు సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా టెర్రరిస్టులు.. వారి హేండర్లు అత్యంత సీక్రెట్ గా సంభాషించుకుంటున్నారు. సూచనలు.. ఆదేశాలు చేరడానికి దారుణమైన వెబ్సైట్లు.. ప్రత్యేకమైన ఎన్క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారు.ఉగ్రవాదుల కార్యకలాపాలను తెలుసుకోవడానికి కొంతకాలంగా ఇండియన్ ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ సోషల్ మీడియా వేదికల మీద దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల నియామకాల కోసం టెర్రరిస్ట్ గ్రూపులు.. పాకిస్తాన్ దేశానికి చెందిన ఐఎస్ఐ.. రహస్య మార్గాల ద్వారా తమ ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. లైవ్ చాట్ ఫీచర్లతో కూడిన దారుణమైన వెబ్సైట్లు.. యూజర్ల గుర్తింపుర దాచిపెట్టే మెసేజ్ అప్లికేషన్లను ఉగ్రవాదులు వాడుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై పాకిస్తాన్ ఉగ్రవాదులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్టు కూడా సమాచారం. ఉగ్రవాదుల మధ్య కమ్యూనికేషన్ కోసం గతంలో వాట్సాప్, ఫేస్బుక్,మెసెంజర్, సిగ్నల్ వంటి సోషల్ మీడియా యాప్స్ ఉపయోగించేవారు. అయితే దీని మీద ఇండియన్ పోలీస్ డిపార్ట్మెంట్ గట్టిగా ఫోకస్ చేయడంతో ఉగ్రవాదులకు ఊపిరి సలపని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్.. వియత్నాం ఆధారిత అప్లికేషన్లు.. చైనా మూలాలు ఉన్న అప్లికేషన్లను ఉగ్రవాదులు వాడుతున్నట్టు తెలుస్తోంది.

# వైసీపీని ముంచుతున్న కోటరి...



విజయవాడ, వైఎస్సార్‌సీపీలో గతంలో పనిచేసిన కీలక నేత, ఇప్పుడు చక్రం తిప్పుతున్న మరో నేత మధ్య నెలకొన్న విభేదాలు క్రమంగా బహిరంగ విమర్శలకు దారితీస్తున్నాయి. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మధ్య సాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కీలకంగా వ్యవహరించిన నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వైసీపీ అంతర్గత పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.విజయసాయిరెడ్డి విడుదల చేసిన బహిరంగ లేఖపై సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. జగన్ విజయసాయిరెడ్డిని ఎక్కువగా అభిమానించారని, గుర్తు చేశారు. తమను లక్ష్యంగా చేసుకుంటే తమ స్పందన కూడా గట్టిగానే ఉంటుందని హెచ్చరించారు. విజయసాయి ఆరోపణలను ఇకపై పట్టించుకోబోనని, పార్టీ నేతలు కూడా వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.తనపై కేసులు నమోదైన సమయంలో తాను రాజకీయాల్లో లేనని సజ్జల పేర్కొన్నారు. 2024 తర్వాత పలువురు వైసీపీ నేతలు లిక్కర్ కేసుల్లో అరెస్టయిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. విజయసాయిరెడ్డి మాత్రం ఎందుకు అరెస్టు కాలేదనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. విజయసాయి తనను తాను ఎక్కువగా ఊహించుకుంటున్నారని విమర్శించారు.వైసీపీలో ఇప్పటికే నాయకత్వం, పార్టీ భవిష్యత్తుపై చర్చ జరుగుతున్న సమయంలో కీలక నేతల మధ్య బహిరంగ విమర్శలు పార్టీకి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. జగన్ చుట్టూ ఉండే నాయకత్వ వ్యవస్థపైనా గతంలో పలువురు నేతలు విమర్శలు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు విజయసాయి?సజ్జల వివాదం ఆ చర్చకు మరోసారి తెరతీసినట్లయింది.ఇద్దరు నేతల మధ్య విభేదాలు మరింత ముదరకముందే పార్టీ అధినేత వైఎస్ జగన్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు జగన్ ప్రకటించిన నేపథ్యంలో, ముందుగా పార్టీలోని అంతర్గత విభేదాలను చక్కదిద్దుకోవడం కీలకంగా మారింది.పార్టీకి చెందిన కీలక నేతలే బహిరంగంగా పరస్పరం విమర్శలు చేసుకోవడం కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ప్రతికూల సంకేతాలు పంపే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు వైసీపీకి దూరమైన నేపథ్యంలో తాజా వివాదం పార్టీ బలహీనతకు సంకేతంగా మారకుండా జగన్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. విజయసాయిరెడ్డి?సజ్జల మధ్య మాటల యుద్ధం ఇక్కడితో ఆగుతుందా? లేక మరింత ముదురుతుందా? దీనిపై వైసీపీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఈ సారైనా కేసీఆర్ వస్తారా...



హైదరాబాద్ ,తెలంగాణ శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు శాసనసభ కార్యదర్శి అధికారికంగా సర్క్యులర్ జారీ చేశారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని స్పీకర్ ఆదేశించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఈ సమావేశాలకు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినప్పటికీ, కేసీఆర్ వచ్చే అవకాశం లేకపోవడంతో బీఆర్ఎస్ పోరాట భారాన్ని కేటీఆర్, హరీష్ రావు తమ భుజస్కంధాలపై వేసుకొని సభలో ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.ఈ సారి అసెంబ్లీ వేదికగా ప్రధానంగా ప్రజా సమస్యలు, గ్యారంటీల అమలుపై రసాభాస జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధుల పెన్షన్ల పెంపు , బకాయిల చెల్లింపు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, రైతు భరోసా నిధులు, 24 గంటల విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. దీనికి తోడు వివాదాస్పదంగా మారిన సెక్షన్ 22-ఎ భూముల వ్యవహారం, భూసేకరణ అంశాలను సభలో అస్త్రాలుగా మలుచుకోవడానికి విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి.మరోవైపు, ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు అధికార కాంగ్రెస్ పక్కా వ్యూహంతో అడుగులు వేస్తోంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలు, కృష్ణా-గోదావరి జలాల వివాదాలు , భూ కేటాయింపులపై ప్రతిపక్షాన్ని కౌంటర్ చేసేందుకు మంత్రులు సమాధానాలు సిద్ధం చేసుకుంటున్నారు. అన్నింటికీ మించి, చట్టసభల్లో యువతకు ప్రాతినిధ్యం పెంచేందుకు వీలుగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి సభలో ఒక చారిత్రాత్మక తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.సభ ప్రారంభమైన తొలి రోజే జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ సెషన్ ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై స్పష్టత రానుంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని సభలో గళమెత్తాలని కేటీఆర్, హరీష్ రావు బృందం భావిస్తుండగా, తమ రెండేళ్ల పాలనా విజయాలు , సంక్షేమ కార్యక్రమాలను అసెంబ్లీ వేదికగా ఎత్తిచూపేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, 1000 ఎకరాల్లో కేసీఆర్, 100 ఎకరాల్లో కేటీఆర్, జన్వాడలో 50 ఎకరాల్లో కవిత ఫామ్‌హౌస్ కట్టుకున్నారని ఆరోపించారు. అంబర్‌పేటలో పదెకరాల్లో నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తున్నామని ప్రకటించారు. ఆక్రమణలకు గురైన బతుకమ్మ కుంటను పునరుద్ధరించామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రాను తీసుకువచ్చామని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవం అయిన రేషన్ కార్డు ఇవ్వాలని ఏనాడైనా ఆలోచించారా..? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు.ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ తన బాధ్యతలను పూర్తిగా విస్మరించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఆయన భద్రత, వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నప్పటికీ, కేసీఆర్ 1000 రోజులుగా అసెంబ్లీకి గానీ, ప్రజల్లోకి గానీ రాకుండా ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని అన్నారు. ప్రజల సొమ్ముతో కోటి రూపాయల పైగా జీతం, సదుపాయాలు పొందుతూ ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పదేళ్ల బీఆర్ఎస్ పాలన వర్సెస్ 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రత్యక్ష చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను రూ.8.11 లక్షల కోట్ల అప్పుల్లో నెట్టి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించిందన్నారు. 5.5 లక్షల మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రతినెలా 1వ తేదీన లేదా 5వ తేదీకల్లా క్రమం తప్పకుండా జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రిటైర్మెంట్ బకాయిల కింద రూ.6,000 కోట్లు విడుదల చేశామని, ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని తెలిపారు. తమ 1000 రోజుల ప్రజా పాలనలో 72,000 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశాం. స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను స్థాపించామని చెప్పారు. ఉచిత విద్యుత్, రూ.20,617 కోట్ల రైతు రుణమాఫీ సహా వ్యవసాయ రంగానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. తమ 1000 రోజుల సంక్షేమ పాలనలో పేదలు, దళితులు, బీసీలకు పెద్దపీట వేశామని సీఎం ఉద్ఘాటించారు. సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహంతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న, నెక్లెస్ రోడ్డులో జ్యోతిబా పూలే విగ్రహాలను ప్రతిష్ఠించామని గుర్తుచేశారు. సామాజిక న్యాయంలో భాగంగా 1000 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించడమే కాకుండా, 1931 తర్వాత దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీసీ కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేసి కేంద్రానికి సవాల్ విసిరామని తెలిపారు. రాజకీయ పదవుల్లో బలహీన వర్గాల నాయకులకు, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించామని పేర్కొంటూ.. మహేష్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లను మంత్రులుగా, అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీగా నియమించామని ప్రస్తావించారు.

# వైసీపీ తెలంగాణ నేతగా కోమటిరెడ్డి...?



నల్గొండ ,వైసీపీ పార్టీ ఎన్ఆర్ఐ టీమ్ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యక్ష ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కదారి పడుతున్నాయని, ఈ తరుణంలో మార్పు దిశగా బలమైన అడుగులు వేయాల్సిన అవసరం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రజలకు మేలు చేసే ఒక బలమైన రాజకీయ వేదికను పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నానని, అందుకే గత కొన్ని నెలలుగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిర్భయంగా ఖండిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమ పంథానే తనకు ఆదర్శమని ఈ వేదికగా రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో సంక్షేమ వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, విద్యా రంగానికి ఎంతో కీలకమైన ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించలేని దయనీయమైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాజకీయాన్ని కేవలం వ్యాపారంగా మార్చుకుని, పైసలు సంపాదించడమే ధ్యేయంగా వచ్చిన వాళ్లు రాజకీయాల్లో శాశ్వతంగా నిలబడలేరని చెప్పుకొచ్చారు.ఒకప్పుడు నగరాలకే పరిమితమైన అవినీతి, నేడు గ్రామీణ స్థాయి వరకు పాకిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బంధు లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఒక చేతితో రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు నటిస్తూనే, మరో చేతితో గల్లీ గల్లీలో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు పెంచి ఆ డబ్బును ప్రజల నుంచి దారుణంగా గుంజుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలు ప్రజలకు సంక్షేమం అందించడానికి బదులు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని మండిపడ్డారు.గత వైఎస్సార్ స్వర్ణయుగాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా త్వరలోనే ఒక సంచలనాత్మక నిర్ణయంతో కూడిన ప్రజా రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం తెలంగాణ గడ్డపై వైఎస్ఆర్‌సీపీని తిరిగి బలోపేతం చేసి, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో కచ్చితంగా విప్లవాత్మకమైన మార్పు తీసుకువస్తానని చెప్పారు. అంటే వైఎస్ఆర్‌సీపీని ఆయన తెలంగాణలో ప్రారంభించి దానికి నాయకత్వం వహించే దిశగా ఆలోచిస్తున్నారని అనుకోవచ్చు.రాజగోపాల్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. ఆయన నిత్యం ఒక సొంత ఇమేజ్, అగ్రెసివ్ మార్క్ రాజకీయం కోరుకునే నాయకుడు. గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి, మళ్లీ అక్కడ నుంచి కాంగ్రెస్‌లోకి రావడం వెనుక ఆయన ఆశించిన రాజకీయ ప్రాధాన్యతే ముఖ్యం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ నిరంతరం ఆలస్యం కావడం, తనకు మంత్రి పదవి దక్కకపోవడం పట్ల ఆయన వర్గం తీవ్ర తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి నాయకత్వానికి పోటీగా లేదా తన ఉనికిని చాటుకునేందుకు వైఎస్సార్ భావజాలాన్ని ప్లాట్‌ఫారమ్‌గా ఎంచుకోవడం ఆయన వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. వైఎస్సార్ పేరు తెలంగాణలో ఇప్పటికీ కొంతమంది ఓటర్లలో సానుభూతిని నింపగలదని ఆయన భావిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికీ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో వైఎస్సార్‌పై ఉన్న అభిమానం అంతరించిపోలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నేతలను, పాత వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను ఒక తాటిపైకి తెచ్చి సొంత సైన్యాన్ని నిర్మించుకోవడానికి రాజగోపాల్ రెడ్డికి ఇది ఉపయోగపడవచ్చు. ఏ నిర్ణయమైనా ధైర్యంగా తీసుకునే ఫైటింగ్ నేచర్ రాజగోపాల్ రెడ్డి సొంతం. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడని ఆయన నైజం.. తెలంగాణలో ఒక ప్రాంతీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి కావాల్సిన ఆర్థిక, రాజకీయ సత్తాను ఇస్తుంది. ఏపీకి చెందిన వైఎస్సార్‌సీపీ జెండాతో తెలంగాణలో రాజకీయం చేయడం ఎంత ప్రమాదకరమో షర్మిల అనుభవాలు నిరూపించాయి. ఏపీ కేంద్రీకృత పార్టీగా ముద్రపడిన వైఎస్సార్‌సీపీని తెలంగాణలో రీ-ఓపెన్ చేస్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఆయనపై ఆంధ్రా పార్టీ అనే బలమైన తెలంగాణ సెంటిమెంట్ దాడిని విసిరే అవకాశం ఉంది.ప్రస్తుతానికి రాజగోపాల్ రెడ్డి వేస్తున్న అడుగులు కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగమని కొందరు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ కేబినెట్ పదవి ఇవ్వకపోతే, ఆయన కాంగ్రెస్‌ను వీడి సొంత దారి చూసుకోవడం ఖాయం. కానీ నేరుగా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుంటారా లేక వైఎస్సార్ పేరుతో కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ మద్దతు తీసుకుంటారా అనేది వేచి చూడాలి. తెలంగాణ రాజకీయాల్లో వాక్యూమ్ ఉందనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ని తెలంగాణలో పునరుద్ధరించడం అత్యంత సాహసోపేతమైన అడుగు. ఈ రిస్క్ చేసి ఆయన తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తారా లేదా మంత్రివర్గ విస్తరణ వరకు వేచి చూస్తారా అన్నదే రాబోయే రోజుల్లో తేలనుంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140